ఈ వారం కథ

అంతర్మథనం

పి.యమ్.సుందరరావు

'నాన్నా! మా క్లాసులో అందరిలో కన్నా, ఒక్క తప్పుకూడా పోకుండా ఒకటి నుండి పన్నెండు ఎక్కాల వరకు అప్పజెప్పినందుకు, ఈ సబ్బుపెట్టె బహుమతిగా ఇచ్చారు చూడు!' అని రెండవ తరగతి చదువుతున్న రాంబాబు గర్వంగా తండ్రి రాములు చేతిలో పెట్టాడు సబ్బుపెట్టెను.

కొడుకిచ్చిన సబ్బుపెట్టెను ఆనందంగా అందుకుని ఒక్కసారి గర్వంగా భార్యకేసి చూసి 'చూసావుటే ఈ రాములు కొడుకంటె ఏంటనుకున్నావు. అన్నాడు మూడు రూపాయిల సబ్బుపెట్టెను ఘనంగా చూపిస్తూ.

రవణమ్మకు మనసులో సంతోషంగా ఉన్నా, పైకి మాత్రం "అబ్బ' తెచ్చాడులే గొప్ప కొడుకు మూడు రూపాయిలొస్తువు." అందికొంచెం వెటకారంగా.

"ఎన్ని రూపాయిలవేది ముఖ్యం కాదే! బహుమతంటే బహుమతే. వాడు అందరిలో గొప్పగా దానిని అందుకుంటుంటే, అందరూ చూసి ఎవర్రా ఈ అబ్బాయి అనుకుంటూ, తెలిసిన వాళ్ళు మన ఊరి రైస్‌మిల్లు రాములు కొడుకుకదూ. ఎంత తెలివిగలోడు ఈ కుర్రాడు అని మెచ్చుకోవడం ఎంతగొప్పనుకున్నావు" అన్నాడు కొడుకు తలమీద చెయ్యివేసి జుట్టు సరిచేస్తూ.

"ఏంటి వదినో అన్నయ్య తెగ గొప్ప చెబుతున్నాడు. అవునూ! మా మేనల్లుడి మొహమేంటి పెట్రోమాక్స్ లైట్‌లా వెలిగిపోతంది. ఈ రోజు పంతులమ్మ చేత తన్నులు తినకుండా వచ్చాడేంటి." అంటూ వచ్చింది ఎదురింటి అనసూయమ్మ.

"అట్లా తన్నులు తినేది మీ అమ్మాయే! ఒకటో తరగతి అయిపోవస్తూంది. ఇంకా అక్షరాలన్నీ పూర్తిగా రావు." అన్నాడు రాంబాబు తనను ఎగతాళి చేసిందనే కోపంతో.

కొడుకు మాటలకు ముసిముసిగా నవ్వుతూ రాములు "మీ అల్లుడికి స్కూల్లో బహుమతిచ్చారు చూడమ్మాయ్" అంటూ సబ్బు పెట్టెను అనసూయమ్మ చేతిలో పెట్టాడు రాములు.

"అబ్బో! పెద్ద బహుమతే సంపాయించుకొచ్చాడు మా అల్లుడు. అయితే అయింది గాని. ఈ వంకతో కొడుకు కట్నం మాత్రం పెంచమాకు. మేం మాత్రం ఎక్కువ ఇచ్చుకోలేం. అన్నయ్యా! ఇప్పుడే చెబుతున్నాం. అంది ముందరకాళ్ళకు బంధాలేస్తున్న రీతిలో

"నా కొడుక్కి లక్ష రూపాయిలకు తక్కువిస్తే చేసుకొంటాననుకుంటున్నావమ్మాయ్! అదేంకుదరదు. అక్షరాలా లక్ష రూపాయిలకు తక్కువిచ్చిన ఏ పిల్లనైనా సరే చివరకు మీ పిల్లనైనా చేసుకునేదని లేదు. మా వాడు బంగారమైతే" అన్నాడు రాములు కొడుకును ఒళ్ళో కూర్చోబెట్టుకుంటూ.

అబ్బో ఈయనకు ఆశ చాలా వుందే! అని మనసులో అనుకుని తను మాత్రం తగ్గడం ఎందుకులే అనుకుని పైకి "ఈ బంగారాన్ని ఎంతకైనా కొనుక్కోమా బయటకు పోనిత్తామా" అంటూ రాంబాబు బుగ్గను సాగదీసింది అనసూయమ్మ

ఆ మాటకు తక్షణంలోనే లక్ష రూపాయిలు తన చేతిలోకి వచ్చినట్టు, తనో రైస్‌మిల్లు ఓనరైనట్టు సంబరపడ్డాడు రాములు.

"రవణా! మీ అన్నయ్యకు ఈ వారం వైట్‌డూటి పప్పులమిల్లు దగ్గరకెళ్ళి అన్నమిచ్చినస్తా. ఇంటికేసి చూస్తుందూ" అంటూ తమ ఇంటినసారాలో ఉంచిన క్యారేజిని పట్టుకెళ్ళింది అనసూయమ్మ తన మొగుడికోసం.

మధ్య తరగతి దిగువ తరగతి వాళ్ళు ఎక్కువమంది సంతోషానికి దుఃఖానికి కారణం భగవంతుడేనమకుంటారు. ఆ రోజు రాంబాబుకి ఆ బహుమతి రావటానికి కూడా కారణం ఏడుకొండల వాడేనమకుని, రాములు కొడుకుతో ఇంట్లోకెళ్ళి ఏడుకొండలస్వామికి, కృష్ణుడు, రాముడు ఫోటోలకు దణ్ణంపెట్టుకున్నాడు. పనిలోపనిగా ఆ ఊరి దేవతైన గంగావమ్మకు కూడా మనసులోనే దణ్ణం పెట్టుకున్నాడు. రాంబాబు చేతకూడా అదే పని చేయించాడు.

నలభైయేళ్ళ రాములు చదివింది అయిదో తరగతి అయినా, రోజూ పేపరు చూస్తుండటంతో అంతకన్నా ఎక్కువ చదివిన వాడిలా కనిపిస్తుంటాడు, ఆ ఊరిలోనే సాంబిరెడ్డిగారి రైస్‌మిల్లులో మొదట బస్తాలు మోసేవాడిగా చేరి, తన తెలివితేటలతో కొద్ది కాలంలోనే డ్రైవరయ్యాడు. రవణమ్మతో పెళ్ళయిన చాలాకాలానికి కలిగిన ఏకైక సంతానం రాంబాబు. అందుకే కొంత గారాబంగా పెంచుతుంటాడు.

తనకు ఒక్కడే పుట్టడం తన తండ్రి వారసత్వమనుకున్నాడు రాములు. ఆ ఒక్కడిని గొప్ప ఉద్యోగస్తుడిని చేయాలని రాములు కోరిక. ఆ కోరిక నెరవేరడం కోసం ఎంతో కృషి చేస్తున్నాడు. తాము పస్తులుండైనా సరే రాంబాబుకి మంచి తిండిపెట్టడం, తాము చిరిగిన బట్టలైనా ధరించి, కొడుక్కి మంచి బట్టలు కుట్టించడం స్కూలుకెళ్ళేటప్పుడు రాంబాబు అడిగినంత చిల్లర ఇవ్వటం చేస్తుంటాడు.

మనవడికి బహుమతి రావటం, కొడుకు రాములు దాని గురించి ఆనందించటం, మంచంలో పడుకున్న వాంచారయ్య గమనించి సంబరపడిపోతూ కూడా, రాత్రి మంచి కాస్తున్న జ్వరానికి తాళలేక "రాత్రి మంచి ఒళ్ళు పెనంలా కాలిపోతందంటే, నీకు చీమకుట్టినట్టు కూడా లేదుగదరా! ఒంటి తోపాటు కడుపుకూడా పోటీ పడి కాలుతుంది. డాక్టరుకి చూపించకపోతేమాలె కనీసం కొట్లోవెళ్ళి ఓ మాత్ర, రొట్టెముక్క తెస్తే, మాత్రేసుకుని, అది తిని పడుంటాగదా!" అని ఖంగుమనే గొంతుతో మండిపడ్డాడు రాములుపై.

రెండురోజులుగా అన్నంలేక పోయినా అంతగట్టిగా మాట్లాడాడంటే, ఎంత రోషం వచ్చిందో! అయినా ఈ ముసలాడికి ఇంతరోషమా! అనుకుని రాములు 'ఏంటేముసలోడా, వాగుతున్నావు, నీకు కూడుపెట్టడమే దండగ. పైగా మందులు కూడానా. అయినా మవ్వు ఛస్తే దేశానికేం నష్టం లేదులే!" అన్నాడు వెటకారంగా.

చిన్నప్పుడు నీకు పోయేరోగం వస్తే చూపించకుండా ఇట్టాగే అనుకుంటే, మవ్విప్పుడు వేలమీద కులికేవాడివే కాదుగదరా! అని పైకి అనలేక తన దురదృష్టానికి తనవే నిందించుకుంటూ కిమ్మనకుండా ఉండిపోయాడు.

"ఊరు పొమ్మంటూంది. కాదు రమ్మంటూంది. ఈ వయస్సులో ఇంకా మందులూ, మాకులూనా!" అంది మొగుడికి వత్తాసుగా రవణమ్మ.

"నేను నిన్ను ఎట్టా పెంచింది. మవ్వు నన్ను ఎట్టా చూస్తుంది పైన దేవుడు చూస్తున్నాడు. గుళ్ళో గంగావమ్మ చూత్తంది. అంతా ఆ తల్లే చూసుకుంటుంది." అన్నాడు వాంచారయ్య కొడుకు రాములు వైపు చూస్తూ.

రోజూ తనెంతో భక్తితో దణ్ణం పెట్టుకునే దేవుడు శిక్షిస్తాడనే అర్థం వచ్చేటట్లు తండ్రి మాట్లాడినా పట్టించుకోకుండా రాములు 'అరవగాకు ముసలోడా! నేనెంతో మంచోడ్ని కాబట్టే అన్నం పెడుతున్నా! అదే ఇంకొకరైతే బొచ్చెచేతికిచ్చి పంపేవాళ్ళు." అని తనగొప్పతనాన్ని చాటుకున్నాడు.

ఆ మాట ఎన్నోసార్లు రాములు నోటినెంట విన్నాడు వాంచారయ్య. అలా విన్న ప్రతిసారీ, తన ఆవవాలు తెలియనంత దూరంగా వెళదామనుకుంటాడు. కానీ ఒక్కగానొక్క కొడుకుని చూడకుండా ఉండలేక, తిట్టోమొట్టో పెట్టే ముద్ద కోసం ఎదురుచూస్తూ ఉండిపోయాడు వాంచారయ్య.

ఇక కొడుకు, కోడలు ఏం మాట్లాడకుండా ఉండటంతో తనకూడా మౌనంగా ఉండి, బొడ్లో దోపుకున్న అయిదు రూపాయిల నోటును తీసి జాగ్రత్తగా మడతలు విప్పి తృప్తిగా దానివంక ఒకసారి చూసి, అందులో మనవడి నవ్వును చూసి మురిసిపోయి, మళ్ళీ జాగ్రత్తగా మడతలుపెట్టి పంచె చెరుగుకు కట్టుకుని బొడ్లో దోపుకుని, ఒళ్ళూ, కడుపు పోటీ పడి రేపుతున్న మంటలకు బాధపడుతూ మంచానికి ఒక పక్కకు కరుచుకుపడుకున్నాడు.

పంచె చెరుగుకు కట్టిన అయిదు రూపాయిల నోటును తీసి వణికే చేతులతో కొట్టువాడికిచ్చి "మనవడికి రాసుకువేది మంచి కలమియ్యి" అన్నాడు వాంచారయ్య.

"అయిదు రూపాయిలకు మంచిది ఎట్లా వస్తుంది" అని, అయిదు రూపాయిలకు తగ్గదే ఇచ్చాడు.

దీన్ని మనవడి చేతికిచ్చాడు. ఇదినేనిచ్చే బహుమతి అన్నట్టుగా చూస్తూ.

"ఇది మంచిది కాదు తాతయ్య" అన్నాడు దాని వంక గుచ్చిగుచ్చి చూస్తూ రాంబాబు అంతకంటే ఖరీదుగలది నేనింక కొనివ్వలేమరా! అన్నట్టు దీనంగా ముఖం పెట్టాడు వాంచారయ్య.

ఆ కలాన్ని అయిష్టంగానే జేబులో పెట్టుకుని తాతయ్య చెయ్యి పట్టుకుని ఇంటికి బయలుదేరాడు రాంబాబు. తన దగ్గరున్న అయిదు రూపాయిలతో మనవడి సంతోషంలో పాలు పంచుకున్నా ఇంకా ఎక్కువ ఖరీదు గలది కొనివ్వలేక పోయానే, అనే బాధ మరోపక్క తొలిచివేస్తూనే ఉంది. వాంచారయ్యను.

అదే ధ్యాసలో మనవడితో రోడ్డుమీద నడుస్తుండగా కాస్త దూరం రాగానే, ఒక స్కూటరు రివ్వున రాంబాబుమా, వాంచారయ్యమా ఢీకొట్టింది.

అంతే! గాలిలో రివ్వున ఎగిరి అల్లంత దూరాన ఉన్న రాళ్ళగుట్టమీద పడ్డాడు రాంబాబు. వాంచారయ్య పక్కనే ఉన్న మురికిగుంటలో పడ్డాడు. వారిని చూసిన స్కూటర్ వ్యక్తి అక్కడే ఉంటే, జనం చేతుల్లో నుగ్గుయిపోతానని ఒక్కక్షణంలో స్కూటర్‌తో సహా మాయమయ్యాడు.

జనం చుట్టూ చేరారు. అది చాలా చిన్న ఊరు కావటాన రాములుకి నిముషాల మీద చేరిపోయిందీ వార్త.

పరుగుల మీద వచ్చి "నా బంగారు బిడ్డను ఎవరో పొట్టనపెట్టుకున్నారో దేవుడా! అంటూ గుంపుగా చేరిన జనాన్ని తోసుకుని, రాంబాబును చేతులమీద వేసుకుని ఇంటికి వచ్చి, వసారాలోని మంచంమీద పడుకోబెట్టాడు. రవణమ్మకు కడుపు చెరువైంది. చుట్టుపక్కల జనం వచ్చి మంచంచుట్టూ మూగారు.

ఒంటినిండా మరకలు, కొన్నిచోట్ల ఇంకా రక్తం వస్తూనే ఉంది. శ్వాసభారంగా పీలుస్తున్నాడు.

వాంచారయ్య రొప్పుతూ, దొర్లుతున్నలాంటి నడకతో వచ్చాడు 'ఏడి! నా మనవడు' అంటూ, జనాన్ని తోసుకుని మంచంమీద రాంబాబు చూసి అక్కడే కూలబడి బోరున ఏడవసాగాడు.

"ఈ ముసలాయనకి కూడా దెబ్బలు తగినట్లుందే!" అన్నారు గుంపులో ఒకరు. అక్కడ వాంచారయ్యను పట్టించుకునే వాడుడే లేడు.

"పాపం! నిన్న సాయంత్రం ఎంత సంబరంగా ఉన్నడో పిల్లోడు, స్కూల్లో ఏదో బహుమతి ఇచ్చారని" అని ఒకరు సామభూతి చూపించారు.

"ఆ స్కూటరోడికి కళ్ళు లేవనుకుంటా. అయినా ఈ ముసలోడు కొట్టుకి ఒక్కడే వెళ్ళక, ఈ పిల్లాడ్ని ఎందుకు తీసుకెళ్ళినట్టు, ఆ పోయేదేదో ఒక్కడే పోయుంటే, పిల్లాడికి ఈ ఆపద వచ్చేది కాదుగదా! అంది మరో ఆవిడ.

అనసూయమ్మ మొగుడు సుబ్బారావు డాక్టర్ కోసం పరుగెత్తాడు.

"పిల్లోడు బతకటం కష్టమే!" అని తేల్చేశాడు మరో వ్యక్తి.

ఆ మాట వినగానే రాములుకి గుండె దడ ఎక్కువైంది. దీనికంతటికి కారణం ఈ ముసలోడే గదా! అనుకుని "నీకెటూ పోయేకాలం వచ్చింది. పోతూపోతూ నా బిడ్డని కూడా తీసుకుపోదామనున్నావా! ముసలోడా!" అంటూ కళ్ళెర్రజేసి మీదకు పోబోయేసరికి, ఎవరో పట్టుకుని ఆపారు రాముల్ని.

ఏమీ చేయలేని, మాట్లాడలేని పరిస్థితి వాంచారయ్యది. ఇందులో తన తప్పులేదు. అది తెలుసుకునే వారు. ఏం చేయలేక మౌనంగా రోధిస్తూ కూర్చున్నారు.

"ఛీ! చేసింది చేసి, దొంగ ఏడుపు ఏడుస్తున్నావా! పో ఇక్కడ్నుంచి. నా కళ్ళెదుట ఉండగాకు." అని కసురుకున్నాడు రాములు.

తనను తన మనవడి నుంచి వేరు చేస్తున్నట్టుగా బాధపడసాగాడు వాంచారయ్య. అయినా ఆ పరిస్థితిలో అక్కడ ఉండలేక శక్తినంతా కూడతీసుకుని, కర్ర ఊతపోడుచుకుంటూ నడక ప్రారంభించాడు.

సుబ్బారావు డాక్టరుని తీసుకొచ్చాడు.

డాక్టరుగారు! మా వాడిని మీరే బతికించాలయ్యా! అంటూ చేతులు పట్టుకున్నాడు రాములు.

'ఏం ఫరవాలేదు మీ వాడికి నేను చేయాల్సింది నేను చేస్తాను గదా! అని శుభ్రంగా గాయాల్ని తుడిచి, మందువేసి కట్లుకట్టాడు.

"దెబ్బలు కొన్ని బలంగా తగిలాయి. రక్తం పోవటం వలన చాలా నీరసంగా ఉన్నాడు అబ్బాయి. ఇప్పుడిప్పుడే కళ్ళు తెరిచేలా లేడు. కళ్ళు తెరచేదాకా ఏ విషయం చెప్పలేం.

ఈలోగా నేను ఒక ఇంజెక్షన్ చేస్తాను. ఇంకా కొన్ని మందులు టౌన్ నుంచి తెప్పిస్తాను. అవి మన ఊర్లో దొరకవు' అంటూ ఇంజెక్షన్ చేసి, డబ్బులు! అన్నట్టుగా చూశాడు డాక్టరు.

సుబ్బారావు అర్థం చేసుకుని, తన ఇంట్లోకి వెళ్ళి వంద రూపాయిల నోటును తీసుకొచ్చి డాక్టర్ చేతిలో పెట్టాడు అది తీసుకుని 'మీరందరూ పక్కకు తప్పుకోండి. అబ్బాయికి బాగా గాలి తగలనివ్వండి. అని జాగ్రత్తలు చెప్పి పోయాడు డాక్టరు.

"కళ్ళు తెరిచేదాకా ఏ విషయం చెప్పలేం" అన్న డాక్టర్ మాటలే పదేపదే వినపడసాగాయి. రాములుకి.

హఠాత్తుగా ఎన్ని ఆపదల మంచైనా సరే తన గుడిచుట్టూ మాటొక్కసారి తిరిగితే, ఆ ఆపదల నుంచి గట్టెక్కించే గంగావమ్మ గుర్తుకొచ్చింది.

పిల్లాడిని జాగ్రత్తగా చూస్తుండమని రవణమ్మకు, సుబ్బారావుకు చెప్పి గుడివద్దకు వచ్చాడు. అక్కడ వాంచారయ్య "నా మనవడ్ని బతికించు తల్లీ!" అంటూ గుడిచుట్టూ గట్టుమీదపడి దొర్లుతూ ప్రదక్షిణలు చేయటం కనిపించింది.

"పాపం, మీ నాయనే పది నిముషాల్నుండి దొర్లలేక, దొర్లలేక దొర్లుతున్నాడు. నిజంగా మనవడంటే ఎంతప్రేమ ఒళ్ళంతా కొట్టుకుపోయి, నెత్తురు కారుతున్నా లెక్కచెయట్లేదు". అన్నారు అక్కడి వారంతా.

రాములు అదేమీ పట్టించుకోకుండా, తన కొడుకుకి ఇలాంటి స్థితి రావటానికి కారణమయ్యాడనేదే మనసులో పెట్టుకున్నాడు. వెంటనే చేతులెత్తి గంగావమ్మకు దణ్ణం పెట్టి గచ్చుమీద పడి "నా బిడ్డను బతికించు తల్లీ!" అంటూ దొర్లసాగాడు.

అలా దొర్లుతూ రాములు, తండ్రి వాంచారయ్య ఒక్క చోటికి వచ్చి ఆగిపోయారు. వాంచారయ్య ఒక్కసారి రాములుకేసి చూశాడు ప్రేమగా. రాములు ఈసడింపుగా తండ్రికేసి చూసి విసుగ్గా పక్కతిరిగి 'నాబిడ్డను బతికించు తల్లీ!' అంటూ దొర్లసాగాడు వాంచారయ్య చూపు అలాగే నిలిచిపోయింది.

అన్నయ్యా! అన్నయ్యా! మన్నిక్కడున్నావా! నీ కోసం ఊరంతా తిరుగొస్తున్నా! రాంబాబు గాడు కళ్ళు తెరిచాడు. నాన్నా! నాన్నా! అని నీ కోసం కలవరిస్తున్నాడు. అని ఆయాసపడుతూ వచ్చి చెప్పింది అనసూయమ్మ.

అది విని గంగావమ్మ నా బిడ్డను బతికించిందని లేచి, పాపం నీ తండ్రి చచ్చిపోయాడయ్యా! అని ఎవరో అంటున్నా పట్టించుకోకుండా ఇంటివైపు పరుగుతీసాడు రాములు. వెనకనే బయలుదేరింది అనసూయమ్మ అన్నయ్యా! నిదానం! అంటూ.

డాక్టరు ఎదురై "సమయానికి మంచి మందులు దొరికాయి పాడాము. ఇక ఏం ఫరవాలేదు. కళ్ళు తెరిచాడు పిల్లాడు వెళ్ళిచూడు. అన్ని మాటలు కూడా రాములు చెవిన పడలేదు.

రాములు ఆ క్షణంలోనే తన చేతికి లక్ష రూపాయిలు వచ్చినట్టు, తనొక రైస్‌మిల్లు ఓనరైనట్టు కలలు గంటూ ఇంటికి చేరాడు. "నాన్నా! నాన్నా! అంటున్న కొడుకుని ఒళ్ళోకి తీసుకుని 'నా బంగారు కొండ అంటూ రాంబాబు ముఖంపై ముద్దులు కురిపించాడు రాములు.